క్లుప్తంగా

యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కమలాపురం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పుట్లంపల్లె రోడ్డులోని జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మన కోసం, మన సమాజం కోసం ఉదయం 6 గంటలకే యోగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు, యువకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య

తొండూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రేష్మా ఆధ్వర్యంలో గురువారం సికిల్ సెల్ అనీమియా నిర్మూలన కొరకు ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇనగలూరు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య సికిల్ సెల్ అనీమియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 సంవత్సరం నాటికి సికిల్ సెల్ అనీమియా లేని భారతదేశం మన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, సూపర్‌వైజర్ శశికళ, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లె గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో రోడ్లపై నీరు నిల్వకుండా కాలువల ద్వారా వెళ్లే ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో అవసరమైన ప్రతీచోట వీధిలైట్లు ఏర్పాటు చేసి అలాగే పిచ్చి మొక్కలు లేకుండా చేసి శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం నీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రంగనాయకులు, పబ్లిక్ హెల్త్ డీఈ సురేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఒత్తిడి నివారణ



ఫిజియోథెరఫీ ప్రయోజనాలు వివరిస్తున్న దృశ్యం

కొండాపురం : మానసిక ఒత్తిడి నివారణకు ఫిజియోథెరపీ దోహదపడుతుందని హైదరాబాదు నిజాం వైద్యశాల వైద్యులు సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయ సభా భవనంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ అవసరం, దాని ఆవశ్యకతను వివరించారు. నేడు అధికశాతం మంది స్మార్ట్ ఫోన్ల వాడకంతో రేడియేషన్ ప్రభావంతో ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. అవసరం మేరకే మొబైల్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఓబులేశు, రామయ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

22 నుంచి భాగవత సప్తాహం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానం శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో గల సత్సంగ వేదికపై ఈనెల 22 నుంచి వారం రోజులపాటు దేవి భాగవత సప్తాహం నిర్వహిస్తున్నామని శ్రీ బిట్రా పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షులు కె.సుబ్బారెడ్డి తెలిపారు. ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా నంబూరు కాశీవన ఆశ్రమం నుంచి బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రీనివాస రామానుజదాసు రోజూ దేవీ భాగవతంపై ప్రవచనాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

22న స్నాతకోత్సవం

కడప ఎడ్యుకేషన్: కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 2020–24 బ్యాచ్‌లో విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు ఈ నెల 22వ తేదీ కేఓఆర్ ఆడిటోరియంలో 7వ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ముఖ్య అతిథిగా అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ జీవీఆర్ శ్రీనివాసరావు వస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ భీమేశ్వరరావు



ఎర్రగుంట్లలో వేడుకలను జరుపుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయంలో జూన్ 20తేదీన రెవెన్యూ దినోత్సవం పురష్కరించుకుని తహశీల్దార్ భీమేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1786లో రెవెన్యూశాఖ ఆవిర్భవించిందని పరిపాలన సౌలభ్యంగా తల్లి లాంటి రెవెన్యూశాఖను శాఖలుగా విభజించడం జరిగిందని, అయితే ఏ శాఖలకైనా ఆ గ్రామ సమాచారం కావాలంటే గ్రామాల్లోని వీఆర్ఏలతో వివరాలు అందుతాయని, రెవెన్యూశాఖ అన్ని శాఖలకు తల్లిలాంటి శాఖ అన్నారు. రెవెన్యూశాఖ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సత్వర పనులు పూర్తిచేసి ప్రజల మన్ననలను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ షేక్షా, రెవిన్యూ సిబ్బంది, మండల పరిషత్, పోలీస్‌శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగుట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక తాహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తాహసీల్దార్ సౌజన్యలక్ష్మి అధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి పూర్తి వివరాలను, ఆశాఖ ప్రాధాన్యతను బ్రిటీష్ కాలంలో నుంచి రెవెన్యూ సేవలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాహసీల్దార్ తేజస్వీ, డీటీ రమణారెడ్డి, ఆర్ఐ, వీఆర్ఓ, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు చిటుక వ్యాధి నిరోధక టీకాలు



గొర్రెల కాపరులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారి అమర్నాథరెడ్డి

తొండూరు : మండలంలోని ఎస్.చెర్లోపల్లె గ్రామంలో గురువారం తొండూరు పశువైద్యాధికారి అమర్నాథరెడ్డి గొర్రెలకు చిటుక వ్యాధి నిరోధక టీకాలను సిబ్బందితో వేయించారు. ఈ సందర్భంగా ఆయన గొర్రెల కాపరులతో మాట్లాడుతూ గొర్రెలను వృత్తిగా మాత్రమే కాకుండా వాణిజ్య పద్ధతిలో, అధునాతన యాజమాన్య పద్ధతుల్లో కూడా పెంచుతున్నారన్నారు. గొర్రెల్లో సాధారణంగా చాలా రకాల వ్యాధుల వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వైరస్, బ్యాక్టీరియా వల్ల కావచ్చన్నారు. కొన్ని వ్యాధులను గుర్తుపట్టి చికిత్స అందించేలోపే గొర్రెలు మృతి చెందుతున్నాయన్నారు. తొలకరి జల్లులు పడగానే క్లాస్ట్రీడియం అనే బ్యాక్టీరియా విడుదల చేసే విషపదార్థం వల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. ఈ చిటుక వ్యాధి జూన్, జూలై మాసాల్లో పచ్చికతిన్న జీవాలలో వస్తుందన్నారు. సాధారణంగా చిటుక వ్యాధి లేత వయసు ఉన్న ధృడంగా, ఆరోగ్యంగా ఉన్న జీవాలలో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. ఎవరైనా ఈ వ్యాధి టీకాలు వేయించని వారు ఉంటే వెంటనే టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులకు నిర్వాసితులు సహకరించాలి



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి 4 లేన్ల జాతీయ రహదారి నిర్మాణంలో నిర్వాసితులైన తమకు పునరావాసం కల్పించాలని కమ్మవారిపల్లె వాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎన్‌హెచ్ అధికారులు, నిర్వాసితులతో ఆర్డీవో శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి పనులకు ఆటంకం కల్పించవద్దని, నిబంధనల మేరకే పనులు, పరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. అయితే నిర్వాసితులు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ళ క్రితం ప్రభుత్వమే స్థలాలు కేటాయించడంతో ఇళ్ళు నిర్మించుకన్నామని, ప్రస్తుతం రహదారి తమ ఇళ్ళ ముందే నిర్మాణం జరుగుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం వుందని తెలిపారు. 4 లేన్ల రహదారి ప్రక్కనే నివాసం చేయలేమని, తమకు పునరావాసం కల్పిస్తే మరో చోట ఇళ్ళు నిర్మించుకుంటామని వాదనకు దిగారు. అయితే నిబంధనల మేరకే రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు, స్థానికుల నివాసానికి ఇబ్బంది లేకుండా హైవే అధికారులు గ్రామాన్ని సందర్శించి తగిన చర్యలు తీసుకుంటారని ఆర్డీవో తెలిపారు.

మున్సిపల్ గదుల బాడుగకు వేలం పాట

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలోని పాత నగర పంచాయతీ కాంప్లెక్స్ నందు ఉన్న గదిని అద్దెకు ఇవ్వడానికి ఈనెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో వేలం పాటను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం గుడ్ విల్ కింద రూ.5000 చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.1000 చెల్లించాలన్నారు. నెలకు అద్దె రూ.1350 ఉంటుందన్నారు. ఈ గదిని ఓసీ విభాగంనకు కెటాయించామన్నారు.

మున్సిపాలిటీ స్థలాల కబ్జాలపై దృష్టి సారించాలి

జమ్మలమడుగు : మున్సిపాలిటీ స్థలాల కబ్జాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని మున్సిపాలిటీ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఇటీవల మున్సిపల్ సమావేశంలో మున్సిపాలిటీ స్థలాలు కబ్జాలకు గురి అయ్యాయని వాటిని అధికారులు గుర్తించాలంటూ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు సూచించారు. దీంతో మున్సిపాలిటీలో ఉన్న సచివాలయ ఉద్యోగులతో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమించి ఉంటే వారికి నోటీసులు ఇచ్చి వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ ఆర్ఐఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో మౌలిక వసతులు సరిగా లేని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ఆర్ఐఓ వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణ బేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం, నెలలో మొదటి ఆదివారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఖరీఫ్ పంటలకు మద్దతు ధర ప్రకటించడం శుభపరిణామం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న భాజాపా నేతలు

వేంపల్లె : రానున్న ఖరీఫ్ సీజన్‌లో 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం చాలా మంచి శుభపరిణామమని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగిశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజా మద్దతు ధర పెంపుతో క్వింటా వరి ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2300కి చేరింది. వరితో పాటు ఆవాలు, కందులు, పత్తి, మొక్కజొన్న, రాగి, జొన్న, పొద్దుతిరుగుడు పంటలకు కూడా మద్దతు ధర పెంచుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించిందని తెలిపారు. మూడోసారి అధికారంలోకి రాగానే పీఎం కిసాన్ నిధులు విడుదల చేసి రైతులకు శుభవార్త చెప్పిన మోదీ ప్రభుత్వం తాజాగా కనీస మద్దతు ధర పెంచడం అనేది రైతులకు ఊరట కలిగిస్తుందని తెలిపారు. గతకొన్ని సంవత్సరాలుగా ఆహార భద్రతను పెంపొందించడానికి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ప్రభుత్వ నూనెగింజలు, పప్పు ధాన్యాలు, మిల్లెట్ల వైపు పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే మద్దతు ధర తాజా నిర్ణయంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతుల విషయంలో మోదీ ప్రభుత్వం ఎప్పుడు ముందంజలో ఉంటుందని మరోసారి నిరూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నూనె గింజల మద్దతు ధర పెంచటం ద్వారా నూనెగింజల సాగును ప్రోత్సహించడానికి ఈ పరిణామం ఎంతో సహకరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, ఉపాధ్యక్షురాలు పెడబల్లి సుష్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు యోగాపై అవగాహన సదస్సు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

వేంపల్లె : స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థినులకు యోగా అభ్యాసన, ఆసనాలు, ఉపయోగాలపై కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర స్పష్టంగా వివరించారు. అలాగే యోగా ద్వారా మానసిక ధైర్యాన్ని ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఓబుల్‌రెడ్డి, మల్లేశ్వరమ్మలు వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్ఎం నారాయణమ్మ, పీఈటీ భారతి, ఉషారాణి, ప్రసాద్, తదితర అధ్యాపక ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

• వంతెనపై గుంత



పోట్లదుర్తి వంతెనపై ఉన్న గుంత

ఎర్రగుంట్ల : మండల పరిధి పోట్లదుర్తి గ్రామం వద్ద ఉన్న వంతెనపై పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో వర్షపు నీరు వంతెనపై నిలబడి సిమెంట్ పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు కనిపిస్తు పెద్ద పెద్ద గుంతలు పడి ఉన్నాయి. దీంతో వాహనదారులు వాహనాలు నడపడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలికలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. శుక్రవారం కడప నగర పరిధిలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో కడప నగరంలోని ఉర్దూ స్కూలులో బాలికలు రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, నాప్కిన్స్ వాడటం, తిరిగి వాడిన వాటిని డిస్పోస్ చేయడం తదితర విషయాలపై తెలియజేశారు.

సరిగమ... మధురిమ

సంగీతం ఓ సముద్రం లాంటిది. ఇందులో ఎంత ఈదినా తనివి తీరదు... అలసట ఉండదు... కవితాత్మకమైన మాటలకు మంచి బాణి కూర్చితే మధురమైన పాట అవుతుంది. మదిని కట్టేస్తుంది. ఆనందంతో ఊపేస్తుంది. పల్లెటూరి డప్పు అయినా.. పండితుని మృదంగం అయినా.. ఒకేస్థాయిలో మనసును రంజింపజేస్తాయి. కష్టజీవి నుంచి మహా విద్వాంసుని వరకు సంగీతమంటే అందరికీ ఇష్టమే. నేడు ప్రపంచ సంగీత దినోత్సవం. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



కడప నగరంలో సంగీతం నేర్పుతున్న మాస్టారు రామాచారి

కడప కల్చరల్ : సంగీతం మహా సముద్రం లాంటిది. గురువులు ఎప్పటికప్పుడు ఆ సప్త అక్షరాలతోనే మధురిమలు అందించే రాగాలను సృష్టిస్తారు. మంచి పాట, సంగీతం, మనసుతోపాటు శరీరాన్ని కూడా ఊపేస్తుంది. శ్రమను మరిచే క్రమంలో కష్టజీవి, సంగీతంలో మునిగితేలే పండితుడు దాన్ని ఒకేలా ఆస్వాదిస్తారు. మరికొందరు దీనిని దైవ స్వరూపంగా ఆరాధిస్తున్నారు. పశువును, శిశువును చివరికి విషం చిమ్మే పామును కూడా మైమరిపించే శక్తి సంగీతానికే ఉందంటారు. సంగీతం ఓ మధురమైన లోకం అంటారు.

మన గడపలో...

సంగీత రంగంలో కూడా మన జిల్లా ప్రత్యేకతను చాటుకుంటోంది. మన జిల్లాకు కళల జిల్లాగా గొప్ప పేరుంది. సంగీతం విషయంలో పదకవితా పితామహులు అన్నమాచార్యులు తన కీర్తనలకు కట్టిన బాణీలు నేటికీ సామాన్యులను సైతం ఓలలాడిస్తున్నాయి. మహా కవి పుట్టపర్తి నారాయణాచార్యుల శివతాండవ కావ్యం సంగీత భరితం కావడంతోనే దానికి విశేష కీర్తి ప్రతిష్ఠలు లభించాయి. గణిత మేధావి లక్కోజు సంజీవరాయశర్మ మంచి వాయులీన విద్వాంసులు. దాన్ని వాయిస్తూ ఎంత క్లిష్టమైన లెక్కకైనా టక్కున జవాబు చెప్పేవారు.

వారి వారసులుగా..

నిన్నటితరం సంగీత కర్తలకు నేటితరం వారు వారసులుగా నిలుస్తున్నారు. శ్రీరామ నవకాంత్, గిరిజ, గువ్వల సుబ్బరాయుడు, టీవీఎస్ ప్రకాశ్, శ్రీవాణి అర్జున్ గాయకులుగా విశేషమైన గుర్తింపు సాధించారు. వీరిలో కొందరు సినిమాల్లో కూడా పాడారు. నేలబొట్ల చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు ఈ రంగంలో కృషి చేస్తున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన యువతి కావ్యచందన, గతంలో ఆరవేటి శ్రీనివాసులు, మునెయ్య జానపద గాయకులుగా పేరుగాంచారు. ఆర్టీ ప్రసాద్ రావు జిల్లాలో మంచి సంగీత దర్శకుడిగా పేరు పొందారు. కడప నగరానికి చెందిన యువకుడు వాట్‌కిన్స్ సినిమా సంగీత దర్శకుడిగా, పెంచలదాసు గాయకునిగా రాణిస్తున్నారు. వాయిద్య విభాగంలో తబల సోమయ్య, తబల సుబ్బరాయుడు, గిటారు కళాకారుడు రంజన్, ఆరు తబలాలను ఒకేసారి పలకించగల దిట్ట దండు శ్రీనాథమణి జిల్లాకు ఖ్యాతి తెచ్చారు. ఆయన తబలాపై ప్రత్యేకంగా 'తబలా ఘరాన' పేరిట పెద్ద పుస్తకం రాశారు. కొన్నేళ్లపాటు పుట్టపర్తి సాయిబాబా ఆశ్రమంలో నిలయ విద్వాంసుడిగా పనిచేశారు.

ఆరోగ్య యోగం

అడుగేస్తే ఆయాసం...కారణం ఊబకాయం....శ్వాస తీసుకునేందుకే కష్టం....కారణం శ్వాసకోశ సమస్యలు. షుగర్, అధిక బీపీ బాధలు. డబ్బు, విలాసాలు అనుభవిస్తూనే ఉన్నా... ఏదో తెలియని దిగులు. ఇతరులను చూస్తే అసంతృప్తి.... ఈ సమస్యలకు కారణం మనసు, శరీరాలే. రెండూ విభిన్నమే అయినా వాటి మధ్య ఏదో లింక్ తెగిన భావన. కలిపే శక్తి, హాయిగా నడిపే శక్తిపేరే యోగా. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



యోగా.. ఓ ఔషధం..



యోగాతో నేను అన్న ఆలోచన మనం అనే మహా సముద్రంలో సంయోగం అవుతుంది. యోగం అంటే సంయోగమే. యోగా ద్వారా మనలో పొందిన ప్రేమ, శక్తిని నలుగురితో పంచుకోవాలి. జ్ఞానాన్ని సమాజానికి అందివ్వాలి. స్వీయ ముక్తి, లోక కల్యాణమే యోగా అంతిమ లక్ష్యం. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ చక్కటి ఔషధంగా పనిచేస్తుంది.

- డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరఫిస్టు, కడప

కడప కల్చరల్ : మన సంస్కృతిలో ఆది నుంచి యోగాకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. జన్మస్థలి గనుక మన దేశం ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో సైతం ఆసనాలు వేయిస్తోంది. యోగా ద్వారా ఆరోగ్యాన్ని ప్రపంచమంతా పంచేందుకు 2014లో ఐక్యరాజ్య సమితి అంగీకరించడంతో 177 దేశాలలో యోగా చేస్తున్నారు.

మన యోగా మహాన్

జిల్లాలో యోగా పట్ల ఇటీవల మంచి స్పృహ వచ్చింది. పలు యోగా సెంటర్లు సాధకులతో కళకళలాడుతున్నాయి. కడప నగరంలో మిత్ర యోగా కేంద్రం, విశ్వాత్మ పిరమిడ్ యోగా సొసైటీ, అమ్మవారిశాల, ఆఫీసర్స్ క్లబ్, ఆంజనేయ యోగా కేంద్రం, రామచంద్ర మిషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలలో యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. తర్వాత ప్రొద్దుటూరు, రాజంపేట, బద్వేలు, రాయచోటితో పాటు ప్రస్తుతం దాదాపు అన్ని మండల కేంద్రాల్లో కూడా యోగా, ధ్యాన కేంద్రాలు వెలిశాయి. ప్రత్యేకించి ఓం శాంతి సంస్థ పేరిట బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం సభ్యులు యోగా, ధ్యానం ద్వారా ప్రజల్లో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారు.

గురువులు–సేవలు

కడప నగరంలో సీనియర్ యోగా మాస్టర్ నామా నరసింహయ్య అమ్మవారిశాలలో పాతికేళ్లుగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, డాక్టర్ కె.కల్పనలు యోగా గురించి విస్తృత ప్రచారం చేశారు. నగర శివార్లలోగల ఆంజనేయ పిరమిడ్ సొసైటీ కూడా పలు సంవత్సరాలుగా శిక్షణ ఇస్తోంది. సీనియర్ యోగా మాస్టర్ సిద్దయ్య, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో వీరభద్రారెడ్డి, హరినాథరెడ్డి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. కడప నగరంలోని ప్రైవేటు హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులను యోగా రంగంలో జాతీయ స్థాయి బహుమతులను అందుకునేలా తీర్చిదిద్దారు. జిల్లాలో 60 యోగా సెంటర్ల ద్వారా ఏడు వేల మందికి పైగా శిక్షణ పొందుతున్నారు. మొండి వ్యాధులు సైతం నయం అవుతాయన్న నమ్మకంతో యోగా బాట పడుతున్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు యోగా విద్యలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తెస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి, వక్కల్‌పేట మున్సిపల్ ప్రైమరీ ఉర్దూ స్కూల్ హెడ్ టీచర్ ఎస్.నజీబుల్లా పేర్కొన్నారు. గురవారం నగర సమీపంలోని తమ పాఠశాలలో పిల్లలతో కలిసి మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సల్మా, సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కడప ట్రంక్‌రోడ్డులోని మౌలానా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో సీనియర్ యోగా గురువు పద్మావతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ కో చైర్మన్ మొహమ్మద్ తాజుద్దీన్ పాల్గొని ఆమె అందించిన యోగా సేవలను కొనియాడారు. కడప నగరంలో యోగా గురువు పద్మావతి 23 సంవత్సరాల నుంచి ఉచితంగా సేవలందిస్తున్నారన్నారు. ఈ విషయంలో ఆమె రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు, సన్మానాలు అందుకోవడం ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు పర్వానుద్దీన్, ఉష, ఎస్ రెడ్డిలక్ష్మి, రమాదేవి, సొసైటీ సభ్యులు సిద్దిక్ అలీ అహ్మద్, సయ్యద్‌సుల్తాన్ సలావుద్దీన్, మొహమ్మద్‌షా నవాజ్ తదితరులు పాల్గొన్నారు.